బీఆర్‌ఎస్ సభ సైడ్‌లైట్స్



- రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్) ప్రారంభోత్సవంతో పాటు బీఆర్‌ఎస్ బహిరంగ సభకు నలుగురు సీఎంలు హాజరుకావడంతో పోలీసులు నిబంధనలు కఠినతరం చేశారు.
- పాస్ ఉన్నా, పోలీసులకు అందిన జాబితాలో పేరు లేకుంటే ప్రజాప్రతినిధులను కూడా అనుమతించలేదు. ఇక కొందరిని వాహనాలతో సహా అనుమతించగా, మరికొందరి వాహనాలను ర్యింగ్‌కు మళ్లించారు.
- ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధును అనుమతి లేదని పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. చివరకు ఓ పోలీసు అధికారి జోక్యం చేసుకుని వాహనంతో సహా ఎమ్మెల్సీని లోనికి పంపించారు.
- జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, రఘునాథపాలెం జెడ్పీటీసీ ప్రియాంక వాహనాలను అనుమతించకపోవడంతో నడుస్తూ లోపలికి వెళ్లారు.
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య వాహనానికి అనుమతి లేదని చెప్పడంతో ఆయన వెనుదిరిగారు.
- భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్‌ను ఆపి పాస్, జాబితాలో పేరు లేదనడంతో ఆయన కూడా వెళ్లిపోయారు.
- నూతన కలెక్టరేట్ వద్ద అత్యవసర వైద్య సేవల కోసం 108 వాహనం అందుబాటులో ఉంచారు.
- సభా ప్రాంగణంలో వరంగల్ కార్పొరేషన్‌కు చెందిన షీ టాయిలెట్ల వాహనం అందుబాటులో ఉంచారు.
- మధ్యాహ్నం తర్వాతే సభకు ప్రజలు భారీగా తరలివచ్చారు.
- హైదరాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్, కేసీఆర్ వీరాభిమాని జంగీరుద్దీన్ ప్రత్యేక వేషధారణలో సభకు వచ్చారు.
- భద్రాచలానికి చెందిన బీఆర్‌ఎస్ అభిమాని తూతుక ప్రకాశ్ సైకిల్‌పై ప్రభుత్వ పథకాలు, కేసీఆర్ ఫొటోలతో ఊరూరా ప్రచారం చేస్తూ ఖమ్మం వచ్చాడు.
- ఎండ తీవ్రతతో వాటర్ ప్యాకెట్ల వాహనం రాగానే జనం పోటీపడ్డారు.
- కొందరు సభాప్రాంగణంలోకి వెళ్లకుండా ఎల్‌ఈడీల వద్ద కూర్చుని ప్రసంగాలు విన్నారు.
- పల్లీలు, ఐస్‌క్రీం అమ్మే వారిని సభాప్రాంగణంలోకి వెళ్లకుండా ఓచోట కూర్చోబెట్టి, పోలీసులు కాపలా ఉన్నారు.
- రఘునాథపాలెం మండలానికి చెందిన గిరిజన మహిళలు బిందెలు తలపై పెట్టుకుని సంప్రదాయ దుస్తులతో నృత్యాలు చేస్తూ రాగా, ఖమ్మం యువకులు డప్పుచప్పుళ్ల నడుమ వచ్చారు.
- బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభ ప్రాంగణం ముందు వరుసలో 11గంటలకే వచ్చిన గజ్వేల్, హైదరాబాద్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆశీనులయ్యారు.
- సభ ప్రారంభానికి ముందు పంజాబ్, ఢిల్లీ, కేరళ రాష్ట్రాల భద్రతా అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే, స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ అధికారులు కలియదిరిగారు.
- సభావేదికపై అబ్ కీ బార్.. కిసాన్ సర్కార్ నినాదాన్ని మూడు భాషల్లో ముద్రించారు.
- వేదికపై వరంగల్ సీపీ రంగనాథ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు.
- 11 గంటల నుండి సభా ప్రాంగణానికి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు వచ్చినా, 1.30 గంటల వరకు తక్కువగా ఉన్నారు. సీఎంల హెలీకాప్టర్లు వచ్చాకే రద్దీ పెరిగింది.
- సభావేదికపై ఆరు ప్రధాన కుర్చీలతో పాటు చిన్న కుర్చీలు 45 ఏర్పాటుచేశారు. వీటిలో సీఎంలు, మంత్రులు, ఎంపీలు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రి తుమ్మల, సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు, సీపీఐ సీనియర్ నేత పువ్వాడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు జలగం వెంకట్రావు, చంద్రావతి, మదన్‌లాల్ కూర్చున్నారు.
- సెక్యూరిటీ సిబ్బంది కారణంగా వక్తలు కనపడడం లేదని కార్యకర్తలు కేకలు వేయగా వరంగల్ సీపీ రంగనాథ్ సముదాయించారు.
- 1.45 గంటలకు సాయిచంద్ ఆధ్వర్యాన దూం..ధాం.. మొదలు కాగా, మూడు పాటలతోనే ముగించారు.

– ఖమ్మం సహకారనగర్/ రఘునాథపాలెం/ ఖమ్మంమయూరి సెంటర్/వైరా / ఖమ్మం గాంధీచౌక్

పత్తి సాగు పరిశీలన

కూసుమంచి: గోపాలరావుపేట గ్రామానికి చెందిన ఇంటూరి వెంకటేశ్వర్లు సాగుచేసిన యాసంగి పత్తి తోటను బుధవారం కూసుమంచి ఏడీఏ విజయచంద్ర పరిశీలించారు. రైతుతో మాట్లాడి యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రవీందర్ రైతులు పాల్గొన్నారు.

కదం తొక్కిన బీఆర్‌ఎస్ శ్రేణులు

- భారీగా తరలిన గులాబీ కార్యకర్తలు
- కిక్కిరిసిన రహదారులు
- హోరెత్తిన సభా ప్రాంగణం
- అలరించిన కోలాట నృత్యాలు, డప్పు వాయిద్యాలు

ఖమ్మంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ బహిరంగ సభకు బుధవారం పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచే కాకుండా సూర్యాపేట, నల్గొండ జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో లారీలు, డీసీఎం, బస్సులు, ఇతర వాహనాల్లో వందలాదిగా తరలివచ్చారు. పలు పంచాయతీల నుంచి పార్టీ కార్యకర్తలు దగ్గరుండి మరీ ఖమ్మం సభకు తరలించారు. గ్రామాల్లో డప్పులు, కోలాట నృత్యాలతో, బాణా సంచాలు కాలుస్తూ పార్టీ శ్రేణులు కదం తొక్కారు. సభకు హాజరయ్యేందుకు వచ్చిన వాహనాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బంది పడగా.. పోలీసులు చాకచక్యంతో ట్రాఫిక్‌ను నియంత్రించారు. అంతేకాక ఎటువంటి గొడవలు జరగకుండా ఇతర పార్టీ నాయకులను ముందస్తుగానే అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. – సాక్షి నెట్‌వర్క్


కామేపల్లి(కారేపల్లి): జెండా ఊపి వాహనాల తరలింపును ప్రారంభిస్తున్న ఎంపీపీ సునీత, మండల అధ్యక్షుడు హన్మంతరావు


నేలకొండపల్లి: ర్యాలీని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్


కూసుమంచి: బహిరంగ సభకు ర్యాలీగా బయలుదేరి వెళ్తున్న పార్టీ కార్యకర్తలు


తిరుమలాయపాలెం: సభకు వెళ్తుండగా రహదారిపై ఏర్పడిన వాహనాల రద్దీ


కామేపల్లి(కారేపల్లి): ముచ్చర్ల క్రాస్‌రోడ్డు వద్ద సత్తుపల్లి వైపు వాహనాలను తరలిస్తున్న దృశ్యం


కూసుమంచి: సూర్యాపేట నుంచి లారీలో వెళ్తున్న కార్యకర్తలు


కూసుమంచి: సభకు గ్రామాల నుంచి తరలివెళ్తున్న కార్యకర్తలు, నాయకులు


తిరుమలాయపాలెం: గ్రానైట్ కార్మికులను సభకు తరలిస్తున్న గ్రానైట్ అసోసియేషన్ నాయకులు

సీఎంకు స్వాగతం పలికిన మేయర్..


కేసీఆర్‌కు తిలకం దిద్దుతున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లా నూతన సమీకృత కలెక్టర్ కార్యాలయం ప్రారంభోత్సవం, కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభోత్సవం, బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ బహిరంగ సభలో పాల్గొనేందుకు ఖమ్మం చేరుకున్న సీఎం కేసీఆర్‌కు నగర మేయర్ పునుకొల్లు నీరజ తిలకం దిద్ది పూలతో సాదరస్వాగతం పలికారు.

ఎమ్మెల్సీ కవితతో మాజీ ఎమ్మెల్యే ముచ్చట్లు..


కవితను మర్యాదపూర్వకంగా కలిసి ముచ్చటిస్తున్న చంద్రావతి

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ బహిరంగ సభలో పాల్గొనేందుకు ఖమ్మంకు వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను వైరా మాజీ ఎమ్మెల్యే చంద్రావతి మర్యాద పూర్వకంగా కలిశారు. సభా వేదికపై కవితను కలిసి కొద్దిసేపు ముచ్చటించారు.

1,000 మందితో వలంటీర్ల బృందం..

ఖమ్మంమయూరిసెంటర్: బహిరంగ సభను విజయవంతం చేసేందుకు బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు ఆధ్వర్యంలో 1,000 మంది వలంటీర్‌లతో బృందాలను ఏర్పాటు చేశారు. బృందాల లీడర్లకు వాకీటాకీలను అందజేసి ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ పర్యవేక్షించారు.


వాకీటాకీతో సమన్వయం చేస్తున్న నాగరాజు

సిటీ బస్టాండ్ నుంచి 100 బస్సులు..

ఖమ్మం మామిళ్లగూడెం : బీఆర్‌ఎస్ బహిరంగ సభ సందర్భంగా ఖమ్మం సిటీ బస్టాండ్ నుంచి ఖమ్మం నియోజకవర్గానికి చెందిన కార్యకర్తలను తీసుకు రావటానికి 100 బస్సులు పంపారు. డిపో బస్సులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి బస్సులను రప్పించారు. హైదరాబాద్ నుంచి 63 బస్సులు, నల్లగొండ నుంచి 12 బస్సులు, మధిర నుంచి 20 బస్సులు, ఖమ్మం డిపో నుంచి ఐదు బస్సులు తీసుకొచ్చారు. సిటీ బస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ ఐతగాని వెంకటరాములు, గుండు మాధవరావు, పిట్టల సుధాకర్, మిరియా విజయకుమార్, ఎస్.వెంకటయ్య పర్యవేక్షించారు.


సిటీ బస్టాండ్‌లో పర్యవేక్షిస్తున్న సిబ్బంది

ట్రా'ఫికర్'..

ఖమ్మంలో జరిగిన బహిరంగ సభకు భారీ ఎత్తున వాహనాలు తరలడంతో ఎక్కడిక్కడే వాహనాలు నిలిచిపోయాయి. ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. ఇతర జిల్లాల నుంచి కూడా భారీ ఎత్తున లారీలు, కార్లు, ఇతర వాహనాలు రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గంటల పాటు వాహనాలు నిలిచిపోవడంతో సభకు వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు చాకచాక్యంగా ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. – సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంరూరల్: వరంగల్ క్రాస్‌రోడ్‌లో భారీగా నిలిచిన వాహనాలు

గుట్ట చుట్టూ పోలీస్ వలయం..

ఖమ్మంఅర్బన్: బీఆర్‌ఎస్ బహిరంగ సభా వేదికకు ఆనుకొని ఉన్న వినోభానగర్ కాలనీ(వెలుగుమట్ల) గుట్టు చుట్టూ పోలీస్ వలయంతో బందోబస్తు నిర్వహించారు. కాలనీ సమస్యలపై, ఇంటి పట్టాలు ఇవ్వాలనే డిమాండ్ తదితర వాటిపై బహిరంగ సభకు కాలనీవాసులు ఆందోళన చేస్తారనే సమాచారంతో పోలీసులు అప్రమత్తమై బందోబస్తు ఏర్పాటు చేశారు. సభకు ముందు రోజు మంగళవారం కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. బుధవారం ఉదయం 9గంటల నుంచి 100మందికిపైగా పోలీసులు, ఏడుగురు ఎస్సైలు, సీఐ, డీఎస్పీ బందోబస్తు నిర్వహించారు. అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోసు పర్యవేక్షణలో ఈ బందోబస్తు నిర్వహించారు.

ఖమ్మం మార్కెట్ కమిటీ ఖరారు

చైర్‌పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్‌గా షేక్ అఫ్జల్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ఖరారైంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఖమ్మం 58వ డివిజన్ కార్పొరేటర్ దోరేపల్లి శ్వేతను చైర్‌పర్సన్‌గా, రఘునాథపాలెం మండలం రాంక్యా తండాకు చెందిన షేక్ అఫ్జల్‌ను వైస్ చైర్మన్‌గా నియమించారు. ఇక డైరెక్టర్లు(సభ్యులు)గా గుండ్ల ముత్తయ్య, జాటోత్ సుందర్‌సూర్య, మంద రామకృష్ణ, పోట్లపల్లి నాగరాజు, యాసా రామారావు, నున్నా శ్రీనివాసరావు, మండడపు మాధవరావు, కుతుంబాక నరేష్, తాతా వెంకటేశ్వర్లు, వంకాయలపాటి వెంకటలచ్చయ్య, పత్తిపాక రమేష్, దేవత అనిల్‌కుమార్, టేకులపల్లి పీఏసీఎస్ చైర్మన్ నాగచంద్రారెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి కోలాహలం నాగరాజు, ఏడీఏ ఎ.శ్రీనివాసరావు, మేయర్ పునుకొల్లు నీరజను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుత కమిటీ కాలపరిమితి ఈనెల 28వ తేదీతో ముగియనుండగా, ఆతర్వాత కొత్త కమిటీ రెండేళ్ల కాలానికి గాను బాధ్యతలు స్వీకరిస్తుంది.


శ్వేత, చైర్‌పర్సన్

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయమందిస్తున్న రవీందర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: మండలంలోని కొక్కిరేణి గ్రామంలో ఇటీవల మృతిచెందిన ఎలకొండ వరలక్ష్మి, గుర్రం వెంకన్న కుటుంబాలను వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల పీఏ నంద్యాల రవీందర్‌రెడ్డి బుధవారం పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సాయమందించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కొత్త బాలాజీరావు, డివిజన్ అధికార ప్రతినిధి పుసుపులేటి సైదులు, రావుల జగన్నాథరెడ్డి, గుండా సందీప్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు వాలూరి సత్యనారాయణ, అన్నబత్తుల కృష్ణ, ఉపాధ్యక్షులు ఆలేటి రాములు, మహిళా అధ్యక్షురాలు వద్దిరాజు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడికి నివాళి

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలం సాతానుగూడెం గ్రామ పంచాయతీ ఒడ్డుగూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు భూక్యా మంగ్యానాయక్ సంస్మరణ సభకు బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంగ్యానాయక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, జెడ్పీటీసీ బాణోతు వెంకట్‌ప్రవీణ్‌కుమార్‌నాయక్‌తో పాటు రేడబోతు గోపిరెడ్డి, సత్యనారాయణ, లక్ష్మయ్య, శంకర్‌నాయక్, వెంకటయ్య, లాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పలువురిని కలిసిన టీఎన్జీవోస్ నేతలు


సీఎస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

ఖమ్మం సహకారనగర్/రఘునాథపాలెం: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన సీఎస్ శాంతికుమారితో పాటు మంత్రులు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్, కార్యదర్శి ఆర్‌వీఎస్ సాగర్ కలిసి పుష్పగుచ్ఛం అందించి మెమోంటోఅందించారు.కార్యక్రమంలో టీఎన్జీవోస్ నాయకులు నందగిరి శ్రీను, చుంచు వీరనారాయణ, రాధాకృష్ణ, నాగుల్‌మీరా, ఆర్‌ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్‌లు టీఎన్జీవోస్ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. అంతేకాక మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, సబితా ఇంద్రారెడ్డి తదితరులను టీఎన్జీవోస్ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్సీ

ఖమ్మం మామిళ్లగూడెం: బ్రాహ్మణ ఖమ్మం నగర శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు కుమార్తె సురభివాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బ్రాహ్మణులు ఐక్యంగా ఉండి సంఘం బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. సంఘ నగర అధ్యక్షుడు మారం రాజురాధాకృష్ణారావు, కార్యదర్శి శ్రీకాంత్, పర్సా రంగారావు, రామకృష్ణ, వాసు, మాదిరాజు హరీష్, సుబ్బారావు, శేషభూషణం, రజనీకాంత్, సుడా డైరెక్టర్ మాటూరి లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ పైడిపల్లి రోహిణి తదితరులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సురభివాణి

'కంటి వెలుగు' ట్రయల్ రన్ పరిశీలన


కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నేలకొండపల్లి: మండల కేంద్రంలో నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలకు కంటి పరీక్షలు చేశారు. కాగా, గురువారం పాలేరు శాసనసభ్యులు కందాల ఉపేందర్‌రెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించనున్నారు. సిబ్బందికి మెటీరియల్ పంపిణీ చేసిన తరువాత కార్యక్రమాన్ని ఎలా కొనసాగించాలి అనే విషయాలపై సిబ్బందికి ట్రయల్ రన్‌గా చేసి చూపించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ కె.జమలారెడ్డి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంచాయ తీ అధికారులతో ఏర్పాట్లు గురించి చర్చించారు. అనంతరం వైద్యులు, కంటి వెలుగు సిబ్బందిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, ప్రభుత్వ వైద్యాధికారి మణిబాబు, పీహెచ్‌ఎన్ దుర్గ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సుల్లేక ప్రయాణికుల గోస..

- జిల్లావ్యాప్తంగా బస్టాండ్లలో పండగ రద్దీ
- బీఆర్‌ఎస్ సభకు ఆర్టీసీ బస్సులు వెళ్లడంతో అవస్థ
- గంటలకొద్దీ ప్రయాణికుల పడిగాపులు


కొత్త బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

ఖమ్మం మామిళ్లగూడెం : ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు బుధవారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యాన సొంతూళ్లకు వచ్చిన ప్రజలు తిరుగుముఖం పట్టారు. అయితే, ఖమ్మంలో బీఆర్‌ఎస్ సభ నేపథ్యాన ఆ పార్టీ నాయకులు రీజియన్ పరిధిలోని ఆరు డిపోల నుంచి 90 శాతం మేర బస్సులు అద్దెకు తీసుకున్నారు. దీంతో ఒక్క సూపర్ లగ్జరీ సర్వీసులు తప్ప మిగతా బస్సులన్నీ ఖమ్మం సభకు వెళ్లడంతో ఇతర రూట్లలో బస్సుల కొరత ఏర్పడింది. ఫలితంగా పిల్లాపాపలతో బస్టాండ్లకు వచ్చిన వారు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. బీఆర్‌ఎస్ సభకు పోగా మిగిలిన బస్సులను పల్లె ప్రాంతాలకు ఒకటి, అరా మాత్రమే నడిపి రెగ్యులర్ సర్వీసులన్నీ రద్దు చేశారు. ఎక్కువ బస్సులను హైదరాబాద్, తదితర మార్గాల్లో నడపడంతో మిగతా ప్రయాణికులు అవస్థ పడడం కనిపించింది.

బస్టాండ్ ప్రాంగణాల్లో ప్రయాణికుల రద్దీ..

ఉమ్మడి జిల్లా నుంచి పలు ప్రాంతాలకు బస్సులు లేకపోవడంతో పెద్దసంఖ్యలో చేరుకున్న ప్రయాణికులు పడిగాపులు కాశారు. ఒకటి, అరా బస్సులు వస్తున్నా సీట్లు లేక.. నిల్చోవడం సాధ్యం కాక చాలా మంది నిరాశ చెందారు. మరికొందరు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించగా ఇంకొందరు ఇంటిముఖం పట్టారు. కాగా, ప్రైవేట్ పాఠశాలల బస్సులను సైతం ఖమ్మం బహిరంగ సభ కోసం తీసుకోవడంతో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. రీజియన్‌లో బస్సుల కొరతతో నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, హైదరాబాద్ సిటీతో పాటు ఏపీలోని పలు డిపోల నుంచి బస్సులను అధికారులు తెప్పించారు. ప్రయాణికులు రోజంతా ఇబ్బంది పడుతున్నా అధికారులు కనీసం సమాచారం ఇవ్వడంలో విఫలమవడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

పిల్లలతో ఇబ్బంది పడ్డాం..



ఉదయం నుంచి ఖమ్మం బస్టాండ్‌లో పిల్లలతో పడిగాపులు కాస్తున్నాం. కోదాడ వెళ్లాలని వచ్చి ఉన్నాం. బస్సు లేకపోవడంతో చివరకు ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చింది. బహిరంగ సభకు బస్సులు పంపడం వల్ల మాలాంటి సాధారణ ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

– రేష్మ, ప్రయాణికురాలు

బస్సులు లేక కారులో....



సూర్యాపేట వెళ్లటానికి వచ్చాను. ఉదయం నుంచి బస్సు లేకపోవడంతో బస్టాండ్‌లో పిల్లలతో పడిగాపులు కాస్తున్నా. తీరా ఎంక్వయిరీలో అడిగితే బస్సులు రావని, అన్నీ సభకు వెళ్లాయని చెప్పడంతో ఎక్కువ చార్జీ చెల్లించి కారులో వెళ్తున్నా. ముందే తెలిస్తే రాకపోయేవాళ్లం.

– నాగరాజు, ప్రయాణికుడు

ఎన్టీఆర్ సేవలు ఎనలేనివి


నేలకొండపల్లి: నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతిని బుధవారం మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు ప్రాంతాల్లో అన్నదానం, రక్తదాన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఎన్టీఆర్ చేసిన ఎనలేని సేవలను తెలుగు ప్రజల ఎప్పటికి మర్చిపోరంటూ ఆయన సేవలు పలువురు కొనియాడారు. – సాక్షినెట్‌వర్క్


కూసుమంచి: అన్నదానం చేస్తున్న నాయకులు